

పల్లి సాగు.. భలే బాగు

వేరుశనగ సాగు ఆశాజనకంగా ఉందని ఆరుగాలం శ్రమించిన అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



అడవుల సంరక్షణ కీలకం

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్ విద్యార్థులకు సూచించారు. 8లో▸



సమస్యలు పట్టించుకోని..

గురుకులాల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్వీ నాయకులు ఆరోపించారు. 9లో▸

న్యూస్‌రీల్

మెరుగైన వైద్యం అందించండి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరవణ



నాగసమందర్ పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరవణ

ధారూరు: మండలంలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి వెంకటరవణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయరాదని డాక్టర్ మాధవిలతకు సూచించారు. మందుల కొరత ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు.

రేపు బాహుబలి వంటశాల ప్రారంభం



సెంట్రలైజ్‌డ్ కిచెన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కొడంగల్: పట్టణంలో నూతనంగా నిర్మించిన సెంట్రలైజ్‌డ్ కిచెన్‌ను ఈ నెల 6న(శుక్రవారం) ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనరసింహ, జూపల్లి కృష్ణారావు వంటశాలను ప్రారంభిస్తారు. హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం తయారు చేసేందుకు బాహుబలి వంటశాలను నిర్మిస్తున్నారు. నియోజకవర్గంలోని 312 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 27 వేల మందికిపైగా ఉన్న విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. తుది దశకు చేరుకున్న సెంట్రలైజ్‌డ్ కిచెన్‌ను బుధవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిశీలించారు. సంబంధిత అధికారులకు కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఎంపీడీఓ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పీకర్ ప్రసాద్‌కుమార్ పర్యటన

మోమిన్‌పేట: రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం మండలంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ తెలిపారు. మండలంలోని ఏన్కతలలో విద్యుత్ సబ్‌స్టేషన్, మొరంగపల్లిలో ఆరోగ్య ఉప కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. మోమిన్‌పేటలో షాదీముబారక్, కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

తాండూరు టౌన్: పట్టణంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు బైకు ర్యాలీ ప్రారంభవుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల వైఫల్యం, 66 మోసాలు, 420 హామీలను ఎండగడుతూ ఈ ర్యాలీ కొనసాగించనున్నట్లు చెప్పారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ జాతీయ నాయకులు పేరాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

పల్లె పోరుకు సన్నద్ధం

పంచాయతీ ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికారులు

- మూడు విడతల్లో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు
- ఇప్పటికే వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం
- పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు షెడ్యూల్ విడుదల
- జిల్లాలో 585 గ్రామ పంచాయతీలు, 4,982 వార్డులు
- ఓటర్లు 6,82,323 మంది



పరిగి గ్రామ పంచాయతీ కార్యాలయం

వికారాబాద్/పరిగి: త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. జనవరిలో ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ బృందం జిల్లాల వారీగా అభిప్రాయ సేకరణ పూర్తి చేసింది. మరో వైపు ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తి చేసి ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎప్పుడు ఆదేశించినా ఎన్నికలు నిర్వహించేలా జిల్లా పంచాయతీ అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే వార్డుల వారీగా ఫొటోతో కూడిన ఓటరు జాబితాను రూపొందించారు. ఎన్నికల నిర్వహణలో కీలకమైన బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మండలాల నుంచి వాటిని జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత వాటిని ఆయ మండలాల్లోని పంచాయతీలకు తిరిగి పంపించనున్నారు.

మూడు విడతల్లో ఎన్నికలు

జిల్లా వ్యాప్తంగా 20 మండలాలు 585 గ్రామ పంచాయతీలు ఉండగా 4,982 వార్డులు ఉన్నాయి. 6,82,323 మంది ఓటర్లు ఉన్నారు. ఆయా పంచాయతీలను విభజించి మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేలా పంచాయతీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రతి విడతలో ఏడు మండలాలుగా విభజించి ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా లోకేషన్ల, పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించి వసతులపై ఆరా తీశారు. పోలింగ్ తేదీ నాటికి కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించడంతో పాటు ర్యాంపుల నిర్మాణం తదితర సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

బ్యాలెట్ బాక్సులకు మరమ్మతులు

పంచాయతీ ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 2,980 బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. 2019లో నిర్వహించిన పలు స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం వాటిని భద్రపరిచారు. అప్పటి నుంచి వాటిని ఉపయోగించకపోవడంతో మరమ్మతులపై అధికారులు దృష్టి సారించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన అనంతరం బ్యాలెట్ బాక్సులను గ్రామాలకు తరలించనున్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లకు అదనంగా ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా అదనంగా ఎన్ని పోలింగ్ స్టేషన్లు అవసరం.. ఎంత మంది సిబ్బంది కేటాయించాలి.. చేయాల్సిన ఏర్పాట్లుపై వివరాలు సేకరించారు.

పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు

జిల్లాలో వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న పంచాయతీలను గతంలోనే ఎస్టీలకు రిజర్వు చేశారు. దీంతో బీసీ రిజర్వేషన్లకు అన్యాయం జరిగిందనే వాద న తెరపైకి వచ్చింది. ఆశావహులు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. తమ గ్రూపులు, వర్గాలను కూడగట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

పోలింగ్ స్టేషన్ల షెడ్యూల్ ఇలా..

రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం గ్రామ పంచాయతీలు, వార్డులకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం ఈ నెల 6న పోలింగ్ స్టేషన్ల జాబితా తయారు చేసి జిల్లా ఎన్నికల అధికారి నుంచి ఆమోదం పొందాలి. 7న ఎంపీడీఓల ద్వారా పోలింగ్ స్టేషన్ల జాబితా ముసాయిదాను ప్రచురించాలి. 10న జిల్లా ఎన్నికల అధికారిచే రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలి. 12న ఎంపీడీఓలతో మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తారు. అలాగే 7 నుంచి 12వ తేదీ వరకు ప్రచురించిన పోలింగ్ స్టేషన్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 13న ప్రచురించిన పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు,సూచనలు తొలగిస్తారు.16న పోలింగ్ స్టేషన్ల తుది జాబితా కోసం జిల్లాఎన్నికల అధికారి నుంచి ఆమోదం పొందుతారు.17న ఎంపీడీఓల ద్వారా పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రచురిస్తారు.

ఓటరు జాబితా సిద్ధం

ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వార్డుల వా రీగా ఓటరు జాబితాను సి ద్ధం చేశాం. ఎన్నికల కమిషన్ ఎన్ని విడతల్లో పోలింగ్ నిర్వహించాలని సూ చిస్తే అన్ని విడతలో నిర్వహిస్తాం. సిద్ధం చేసిన జా బితాను ఉన్నతాధికారులకు పంపించాం.

– డీపీఓ జయప్రద

స్ట్రాంగ్‌రూంను పరిశీలించిన కలెక్టర్

అనంతగిరి: వికారాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూంను బుధవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిశీలించారు. భద్రత ఏర్పాట్లపై ఆరా తీశారు. అక్కడి రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేశారు. ఇక్కడ విధుల్లో ఉన్న సిబ్బందికి తాగునీరు, వసతులు కల్పించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం అధికారి నెహమత్‌అలీ తదితరులు ఉన్నారు.



స్ట్రాంగ్‌రూంను పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



పరిగిలో డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

డేటా ఎంట్రీలో తప్పులుండొద్దు

- రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి కావాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ప్రజల నుంచి సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో తప్పులు దొర్లకుండా చూడాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. పరిగి మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న డేటా ఎంట్రీ ప్రక్రియను బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల్లో డేటా ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్, ఎంపీడీఓ కరీం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక చర్యలు

బొంరాస్‌పేట: సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదు(డేటా ఎంట్రీ)పై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అదనపు కలెక్టర్ సుధీర్ మండల కార్యాలయంలోనే మూడు రోజులుగా ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. 24గంటల పాటు డేటా ఎంట్రీ ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి బొంరాస్‌పేట మండలం (బొంరాస్‌పేట, దుద్యాల్ మండలాలు)లో 17వేల కుటుంబాలు ఉన్నాయి. 164 ఎన్యుమరేటర్స్ బ్లాకులున్నాయి. 60 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 30 కంప్యూటర్లు ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 50శాతం నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. బుధవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

వేగవంతం చేయండి

తాండూరు: సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని తప్పులు లేకుండా వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ కులగణన సమగ్ర సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్‌తో కలిసి ఈ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 60 శాతం డేటా ఎంట్రీ పూర్తి చేయడం జరిగిందన్నారు.

అభాగ్యుడికి వైద్యం

'ఆధారం' లేదని వైద్యం నిరాకరణ!



సాక్షి ఎఫెక్ట్..

తాండూరు టౌన్: 'ఆధారం లేదని వైద్యం నిరాకరణ' శీర్షికతో సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి వర్గాలు స్పందించాయి. అభాగ్యునికి వైద్యం చేశారు. సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ప్రత్యేక చొరవతో రోగికి చికిత్స అందజేశారు. కర్ణటక రాష్ట్రం చించోళి ప్రాంతానికి చెందిన రోజువారీ కూలీ శివకుమార్‌కు ఎడమ కాలుకు పెద్ద గాయం కావడంతో చికిత్స కోసం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి రాగా ఆధార్ కార్డు లేదని, అతన్ని చూసుకోవడానికి ఎవరూ లేరని వైద్యం అందించలేదు. దీంతో అతను 25 రోజులుగా ఆస్పత్రి ఎదుటే సహాయం కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ విషయం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి సబ్ కలెక్టర్ స్పందించారు. ఆయన ఆదేశానుసారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్ రోగిని అడ్మిట్ చేసుకుని చికిత్స అందజేశారు.



తాండూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివకుమార్



గొట్లపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్

తాండూరు దశ, దిశ మారుస్తా

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తాండూరు రూరల్: తనను గెలిపించిన తాండూరు ప్రజలు రుణం తీర్చుకుంటానని.. నియోజకవర్గ దశ, దిశ మారుస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా బుధవారం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తాండూరు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నేను గెలిచిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో మాట్లాడి వికారాబాద్ – తాండూరు రోడ్డుకు రూ.100 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. మరిన్ని నిధులు తెచ్చి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలకు రూ.400 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషన్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

హాస్టల్‌ను పూర్తి చేస్తాం: కలెక్టర్

గొట్లపల్లి గేటు వద్ద అసంపూర్తిగా ఉన్న బాలికల హాస్టల్ త్వరలో పూర్తి చేయిస్తామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి అసంపూర్తి భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ధారాసింగ్, కోట్‌పల్లి ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ అంజయ్య, నారాయణరెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు నర్సింలు, మహిళా విభాగం అధ్యక్షురాలు శోభారాణి, పీసీసీ రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ రియాజ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, ప్రవీణ్‌కుమార్, కో ఆప్షన్ మాజీ సభ్యుడు నసీర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



కంకల్ పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఈఓ రేణుకాదేవి

పూడూరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ రేణుకాదేవి ఆదేశించారు. న్యాస్ పర్యవేక్షణలో భాగంగా బుధవారం మండలంలోని కంకల్, సోమన్‌గుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్‌టీ పరిశీలికులు మధుసూదన్‌రెడ్డి, కాంప్లెక్స్ జీహెచ్‌ఎం పుష్ప, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం లక్ష్మణ్, సీఆర్‌పీలు గాలయ్య, జంగయ్య పాల్గొన్నారు.

పన్నుల వసూలులో వెనుకబాటు

పన్నులు సకాలంలో వసూలు అయినప్పుడే ప్రగతి సాధ్యపడుతుంది. లేదంటే అభివృద్ధి కుంటుపడుతుంది. మరో నాలుగు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా నేటికీ ముప్పై శాతం పన్నులు కూడా వసూలు కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

- జిల్లాలో 585 గ్రామ పంచాయతీలు
- 1.9లక్షల నివాసాలు
- ఈ ఏడాది పన్నుల లక్ష్యం రూ.8 కోట్లు
- ఇప్పటి వరకు వసూలు చేసింది 30 శాతమే

వికారాబాద్: పన్నుల వసూలులో జిల్లా పంచాయతీ విభాగం లక్ష్యం చేరుకునేలా కనిపించడం లేదు. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి ఇంకా నాలుగు నెలలు మాత్రమే ఉండగా గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూల్ల టార్గెట్ 30శాతం దాటలేదు. ట్యాక్స్ వివరాల ఆన్‌లైన్ నమోదు మరీ దారుణంగా ఉంది. గతేడాది ఈ సీజన్ వరకు 50 శాతానికి మించి పన్నులు వసూలు చేయగా.. ఈ ఏడాది టార్గెట్‌కు ఆమడ దూరంలో ఉన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడం, పన్నుల వసూల్లపై సమీక్షలు నిర్వహించకపోవడం, కొద్ది రోజుల క్రితం వరకు డీపీఓ సెలవులో ఉండటం, పంచాయతీ కార్యదర్శులు సర్వే పనుల్లో ఉండటం వంటివి వసూల్లపై ప్రభావం చూపింది.

లక్ష్యానికి దూరంగా..

జిల్లాలో 585 గ్రామ పంచాయతీలు ఉండగా 1.9లక్షల నివాసాలు ఉన్నాయి. పంచాయతీలు, మండలాల వారీగా 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో రూ.8 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం రూ.2 కోట్లు అంటే టార్గెట్‌లో 30శాతం లోపే వసూలు చేశారు. మరో రూ.6 కోట్ల వసూలు చేయాల్సి ఉంది. ఆయా పంచాయతీల వారీగా 20నుంచి 35 శాతం వరకు పన్నులు వసూలు చేయగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో మాత్రం మూడు నుంచి ఐదు శాతంలోపే పూర్తయ్యింది. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కూడా పన్నుల వసూల్ల జాప్యానికి కొంత కారణమైందని అధికారులు అంటున్నారు.



సుల్తాన్‌పూర్‌లో పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

అన్ని అనుమతులు ఆన్‌లైన్‌లోనే..

పంచాయతీల్లో అన్ని రకాల అనుమతులు ఆన్‌లైన్ విధానంలోకి వచ్చాయి. మొదట్లో ఇళ్ల అనుమతులకు మాత్రమే ఆన్‌లైన్ సేవలందిస్తూ మిగతా వాటిని ఆఫ్ లైన్‌లో కొనసాగిస్తూ వచ్చారు. ట్యాక్స్‌లు.. నాన్ ట్యాక్స్‌ల కింద గ్రామ పంచాయతీల వారీగా లక్ష్యం విధించుకొని పన్నుల వసూలు రూపంలో ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ప్రధానంగా ఇంటి పన్నులు ట్యాక్స్ కిందకు రాగా పంచాయతీల రాబడిలో ఇవే సింహభాగం ఉంటాయి. ఇళ్ల అనుమతులు, జరిమానాలు, సంతల్లో తైబజార్ ద్వారా వచ్చే రాబడులు, వ్యాపార సముదాయాలకు విధించే జరిమానాలు, పన్నులు, అనుమతులు తదితర వాటి ద్వారా సమకూరే ఆదాయాన్ని నాన్ ట్యాక్స్‌ల కింద లెక్కిస్తారు. అయితే ఇంటి పన్నుల వసూల్లు బాగానే ఉన్నా నాన్ ట్యాక్స్‌ల విషయంలో చాలా ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారులతో లోపాయికారిగా వ్యవహరిస్తూ ఫాంహౌస్‌లు, వ్యాపార సముదాయాలకు పన్నులు సక్రమంగా విధించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేక దృష్టి సారిస్తాం



జిల్లాలో పన్నుల వసూలు కొంత వెనుకబడిన విషయం వాస్తవమే. నాన్ ట్యాక్స్‌ల వసూల్ల విషయంలో ఇంకాస్త వెనుకబడి ఉన్నాం. త్వరలో 100శాతం చేరుకుంటాం. పన్నులు సక్రమంగా చెల్లించినప్పుడే నాణ్యమైన సేవలు అందుతాయి.. అంతేకాకుండా జవాబుదారీ తనం పెరుగుతుంది.

– జయసుధ, డీపీఓ

'ఆలూరు' ప్రమాదం బాధాకరం

- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- బాధిత కుటుంబాలకు పరామర్శ

చేవెళ్ల: మండల పరిధిలోని ఆలూరు వద్ద జరిగిన లారీ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆలూరు, నాంచేరి గ్రామాల్లో లారీ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాద ఘటనతో కూరగాయల విక్రయాలను అడ్డుకోవడం సరికాదని.. తాను నేష నల్ హైవే అధికారులతో, కేంద్రం పెద్దలతో మాట్లాడికి వారికి స్థలం కేటాయించాలని కోరుతానన్నారు.

'హైదారబాద్–బీజాపూర్' ఏడాదిలోగా పూర్తి

తాను 2014లో ఎంపీగా ఉన్నప్పుడే ఈ నేషనల్ హైవే మంజూరు చేయించానని.. ప్రస్తుతం పనులు ప్రారంభించేందుకు సైతం తానే చర్యలు తీసుకున్నాని లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. ఏడాదిలోగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ మార్గంలో ఎక్కువ మలుపులున్నాయని.. దీన్ని నేరుగా ఉండేలా చూడాలని ఎన్నోమార్లు అధికారులకు వినతి పత్రాలు సమర్పించానన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్డు వెంటే భూసేకరణ చేయడంతో యథావిధిగా విస్తరణకు అనుమతులు వచ్చాయన్నారు. ప్రమాదాల నివారణకు ఎక్కువ మలుపులున్న దగ్గర వాటిని తీసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, బీజేపీ నాయకులు మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణ గౌడ్, శర్వలింగం, డాక్టర్ వైభవ్‌రెడ్డి, మానిక్యరెడ్డి, రవి, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, శంకర్, రాములు, కుంచం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

2008 డీఎస్సీ అభ్యర్థులపై సీఎం సానుకూలం


సీఎం రేవంత్‌రెడ్డితో సంధ్య

మోమిన్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి 2008 డీఎస్సీ అభ్యర్థులపై సానుకూలంగా స్పందించారని బాధితురాలు సంధ్య పేర్కొన్నారు. 2008 డీఎస్సీ అభ్యర్థులు బుధవారం తన నివాసంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఎన్నో సంవత్సరాలుగా తాము తీవ్రంగా నష్టపోతున్నామని, ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరామన్నారు. దీనిపై స్పందించిన సీఎం ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు సంధ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


ఎద్దు కళేబరం

దుద్యాల్: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు సేరి నర్సిములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని పొలంలో ఎద్దు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

వైద్యాధికారుల నియామకంపై హర్షం

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొన్నేళ్లుగా నెలకొన్న సమస్య తీరింది. ఆస్పత్రిలో చాలాకాలంగా ఒప్పంద వైద్యులే విధులు నిర్వహించేవారు. ప్రభుత్వం ఇటీవల నూతన వైద్యాధికారుల నియామకం చేపట్టింది. ఇందులో భాగంగా దౌల్తాబాద్ పీహెచ్‌సీకి డా.వందన, డా.అమూల్యప్రియదర్శినిలను శాశ్వత వైద్యాధికారులుగా నియమించింది. ఈ క్రమంలో బుధవారం వారు పీహెచ్‌సీలో బాధ్యతలు చేపట్టారు. దీంతో రెగ్యులర్ వైద్యుల నియామకం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా పత్తి కొనుగోళ్లు


కాటన్ మిల్లు వద్ద పత్తి వాహనాలు

మోమిన్‌పేట: సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పత్తి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయని మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం తెలిపారు. మండలంలో పరిధిలోని అయ్యప్ప కాటన్ మిల్లులో రోజుకు 10 నుంచి 15 లారీల్లో పత్తి కొనుగోళ్లు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521గాలు ఉందన్నారు. తేమ శాతాన్ని బట్టి తగ్గుదల ఉంటుందన్నారు. గత నెల 6న ప్రారంభమైన కొనుగోళ్లు ఇప్పటివరకు 39,684 క్వింటాళ్లను 1022 మంది రైతుల నుంచి పత్తి సేకరించినట్లు వివరించారు. మరోపక్క కొనుగోళ్లకు శనివారం, ఆదివారాల్లో సెలవు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

పల్లి సాగు.. భలే బాగు

- ఆశాజనకంగా వేరుశనగ
- ఊడల దశకు చేరుకున్న పంట
- తుంపర సేద్యంతో మొక్కకు సరిపడా నీరు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు


వేరుశనగ పంటకు తుంపర సేద్యం ద్వారా నీటి తడి

దుద్యాల్: వేరుశనగ సాగు ఆశాజనకంగా ఉందని ఆరుగాలం శ్రమించిన అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఈ పంట సాగుకు అనుకూలంగా మారిందని సంబుర పడుతున్నారు. దీంతో వర్షాకాలం వరి పంట సాగు చేయని రైతులందరూ వేరుశనగ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. పంటకు స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందిస్తూ ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేపట్టారు. దీనికోసం తుంపర సేద్యం పరికరాలను వినియోగిస్తున్నారు. వీటి ద్వారా సమాంతర నేలలతో పాటు ఎత్తైన పొలాలకు కూడా నీటిని అందించవచ్చు. తుంపర సేద్యం ద్వారా పంటకు సరైన మోతాదులో నీరు అందించేందుకు ఆస్కారం ఉందని రైతులు చెబుతున్నారు. వేరుశనగ పొడి ఇసుక, ఎర్రమట్టి కలిగిన నేలల్లో బాగా పెరుగుతుంది. బంకమట్టి నేలలు ఈ పంటకు అనుకూలం కాదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పంట కాలం 50 రోజులు గడిచింది. ప్రస్తుతం వేరుశనగ పంట ఊడల దశకు చేరుకుంది. ఒక్కో మొక్కకు దాదాపు 20 నుంచి 25 వరకు కాయలు కాసినట్లు అన్నదాతలు తెలిపారు. మొక్కకు ఈ మాత్రం కాయలు ఉంటే లాభదాయకంగా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు.

పదివేల ఎకరాల్లో సాగు

మండలంలోని లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, కుదురుమల్ల, హస్నాబాద్, చిలుముల మైల్వార్, హస్నాబాద్ , గౌరారం, చెట్టుపల్లి తండా, ఈర్లపల్లి గ్రామాల్లో అధికంగా వేరుశనగ పంటను సాగు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు సుమారు పది వేలకు పైగా ఎకరాల్లో పంటను సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. నిత్యం సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడికి కర్షకులు కసరత్తులు చేస్తున్నారు.


మొక్కకు కాసిన కాయలు

వర్షాలతోనే దిగుబడి



పంటను విత్తుకునే సమయంలో అనుకూలంగా వర్షాలు కురవడంతో నాటిన నుంచే ఆశాజనకంగా ఉంది. వర్షాల వల్ల పంటకు తెగుళ్లు కూడా సోకలేదు. 30 రోజుల పంట కాలం తర్వాత ఆకుకొరుకు పురుగు ఆశించడంతో వెంటనే మందులు పిచికారీ చేసుకున్నాను. ప్రస్తుతం పంట బాగానే ఉంది. మొక్కకు 20 నుంచి 25కుపైగా కాయలు కాసింది.

– ఈరప్ప, రైతు, హస్నాబాద్

తుంపర సేద్యంతో..



గత సంవత్సరం కంటే ఈ ఏడాది వేసిన వేరుశనగ పంట చాలా బాగుంది. పంటకు అవసరమున్న సమయంలో స్ప్రింక్లర్ల సహాయంతో తగినంత నీటిని అందిస్తున్నాం. తుంపర సేద్యం ద్వారా పంటలకు బాగా నీరు అందుతుంది. పంట ఏపుగా కూడా పెరుగుతుంది. ఊడలు బాగానే ఉన్నాయి. ప్రస్తుతం దిగుబడిపై ఆశాజనకంగా ఉంది.

– రాజు, రైతు, హస్నాబాద్

పాత పింఛన్ పునరుద్ధరించాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్ రూరల్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీజీసీపీఎస్ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లూరి క్రాంతికుమార్ కోరారు. బుధవారం పట్టణంలో తహసీల్దార్ విజయకుమార్ చేతుల మీదుగా తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయి యూనియన్(టీజీసీపీఎస్ఈయూ) కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్‌ను అంతం చేసి పాత పెన్షన్ వచ్చేంత వరకు నిరంతర పోరాటాలు చేయాలన్నారు. ఉద్యోగులంతా సంఘటితంగా ఉద్యమించి పాత పెన్షన్‌ను సాధించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఎస్‌టీఓ సిబ్బంది పాల్గొన్నారు.

వారంటీ కార్డుల అందజేత


వారంటీకార్డు అందజేస్తున్న జడ్జి అశోక్, ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: వికారాబాద్, తాండూర్ కోర్టులో స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్న నామాల అశోక్ ఔట్ సోర్సింగ్, స్లీపర్, కుక్, ఇతర సిబ్బందికి వారు మరింత ఆర్థికంగా బలపడేందుకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. వాటికి సంబంధించిన వారంటీ కార్డులు, ఇతర పత్రాలను జిల్లా ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి అందజేశారు.

అనాథ శవానికి 'అమ్మానాన్న' అంత్యక్రియలు

కొడంగల్ రూరల్: అనాథ శవానికి అమ్మానాన్న ఫౌండేషన్ సభ్యులతోపాటు కొందరు యువకులు బుధవారం అంత్యక్రియలు చేశారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన కుర్మయ్య(90) కొడంగల్‌లో ఉంటూ భిక్షాటనతో జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఆయన అస్వస్థతకు గురి కావడంతో 108 వాహనంలో కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పిన అమ్మానాన్న ఫౌండేషన్ సభ్యులు సపర్యలు చేశారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం ఆయన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంకటేష్, శ్రీనివాస్, శివ తదితరులు అమ్మానాన్న ఫౌండేషన్ ఫౌండర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి కుర్మయ్య శవానికి అంత్యక్రియలు నిర్వహించారు.

బెదిరించి.. చైన్ స్నాచింగ్

ఇబ్రహీంపట్నం: కారులో వెళుతున్న వారిని బెదిరించి, బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ వివరాల ప్రకారం.. ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేసే రమేశ్ తన తోటి ఉ ద్యోగినితో కారులో వెళుతున్నారు. బైక్‌పై వచ్చిన దుండగుడు ఆమె మెడలోని 3 తులాల బంగారు గొలుసు లాక్కొని పరారైనట్లు తెలిపారు.

కుల దురహంకారంతోనే ఘాతుకం

- కానిస్టేబుల్ నాగమణిది ఆస్తి హత్య కాదు
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు


మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

ఇబ్రహీంపట్నం: కానిస్టేబుల్ నాగమణిది ఆస్తి గొడవ కాదని, కుల దురహంకార హత్యని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు ఆరోపించారు. మండలంలోని రాయపోల్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ నాగమణి దారుణహత్యపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలోని పాషానరహరి స్మారక కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. నాగమణి పరువు హత్యను.. ఆస్తి గొడవగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఈ కేసును కులాంతర, మతాల వివాహాల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 108 కుల దురహంకార హత్యలు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుల నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా బలమైన పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. నాగమణి హత్య జరిగి రెండురోజులు దాటిన ఆర్ఎస్ఎస్, బీజేపీ, బీసీ సంఘాలు ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. మతం కంటే మానవత్వం, కులం కంటే గుణం ముఖ్యమనే ఆలోచన విధానాన్ని ప్రజల్లో కలిగేలా చైతన్యం తీసుకు రావాలన్నారు. ప్రేమించిన శ్రీకాంత్‌ను 20 రోజుల క్రితం పెళ్లి చేసుకోగానే నాగమణిని హత్య చేయడం దారుణమన్నారు. నాగమణికి సంబంధించిన ఎకరా భూమిని ఆమె భర్త శ్రీకాంత్ పేరుపై చేయాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ సామేల్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుమలత, విజయ, అరుణ, వ్యకాసం జిల్లా కార్యదర్శి జగన్, మాల మహానాడు నాయకులు కృష్ణయ్య, మారయ్య, నాయకులు రఘుపతి, పురుషోత్తం, శంకర్, చరణ, తరంగ్, శ్రీకాంత్, రాజు, కిషన్, యాదగిరి, ప్రజాసంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్థిక తోడ్పాటు ఇవ్వాలి


కేక్ కట్ చేస్తున్న మంజుల

వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల

అనంతగిరి: దివ్యాంగులను డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆర్థికంగా ప్రోత్సహించడం అభినందనీయమని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేశ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని, లక్ష్యం, పట్టుదల ఉంటే సాధించలేనిదంటూ ఏమి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎర్రవల్లి జాఫర్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ స్టేట్ ప్రొగ్రాం మేనేజర్ దేవి, జిల్లా కో ఆర్డినేటర్ రామేశ్వర్, దివ్యాంగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఏన్కతలలో కేంద్ర బృందం పర్యటన


పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఏన్కతల, మేకవనంపల్లి గ్రామాల్లో కేంద్ర బృందం బుధవారం పర్యటించింది. గ్రామాల్లో చేయూత పింఛన్ల పంపిణీ, నూతనంగా దరఖాస్తులు చేసుకొన్న లబ్ధిదారుల వివరాలు, వేలి ముద్రలు రాని వారికి ఎలా అందజేస్తున్నారో తదితర విషయాలను తెలుసుకున్నారు. లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న రిజిస్టర్లు తదితర వాటిని తనిఖీ చేశారు. ఆధార్ ఆధారితంతోనే చేయూత పింఛన్‌ల పంపిణీ జరుగుతుండటంతో లబ్ధిదారులకు నేరుగా వెళ్తున్నాయని బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్నల్ ఆడిటర్ పూజ, ఎంఆర్‌డీ సభ్యులు జ్యోత్స్న, శ్రీకాంత్, బూషయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు నర్సింలు, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

మక్క సాగుకే మొగ్గు

మంచి ధర ఉండడంతో రైతుల ఆసక్తి


దౌల్తాబాద్‌లో మొక్కజొన్న పంట

దౌల్తాబాద్: రైతన్నల ఆలోచనా సరళి కాలానుగుణంగా మారుతుంది. ఎప్పుడూ ఒకే రకంగా వేసే పంటలకు బదులు భిన్నంగా సాగుకు ఉపక్రమిస్తున్నారు. ప్రస్తుత యాసంగిలో చాలా మంది రైతులు మొక్కజొన్న సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. తక్కువ సమయంలో పంట చేతికి రావడం మంచి ధర ఉండడంతో అన్నదాతలు వీటి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. వ్యాపారస్తులు కూడా మద్దతు ధర కంటే ఎక్కువ చెల్లిస్తుంటారు. అందువల్ల ఇప్పటికే మండలంలో గతేడాది కంటే ఎక్కువగా సాగు చేపట్టారు. మండలంలో సుమారు 400 ఎకరాల్లో సాగు చేసినట్లు అధికారుల అంచనా.

ముందే చేతికి వస్తూ

మొక్కజొన్న పంట ఫిబ్రవరిలోనే చేతికి వస్తుంది. వరి సాగు చేస్తే ఏప్రిల్, మే నెలలో పంట చేతికి వస్తుంది. దీనికి తోడు అకాల వర్షాలు వడగళ్ల వానలతో పంట దెబ్బతింటుంది. అదే మొక్కజొన్న సాగుకు ఎలాంటి సమస్య ఉండదు. అందువల్ల ఈసారి చాలా మంది రైతులు ఈ పాటికే మొక్కజొన్న పంటలను విత్తుకున్నారు. మక్కలు ఎకరాలకు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. దీనివల్ల రైతులకు ఎకరాకు రూ.96 వేల వరకు వస్తాయి. పెట్టుబడి రూ.30వేల వకు పోను మిగతాది లాభంగా ఉంటుంది. గత సంవత్సరం నుంచి తిరిగి మొక్కజొన్న సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఆరుతడి పంట కావడంతో పాటు ధర ఎక్కువగా వస్తుండడంతో ఈసారి అధికంగా మొక్కజొన్న సాగవుతుంది.

అడవుల సంరక్షణ కీలకం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్

డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్

అనంతగిరి: మొక్కలను నాటి, సంరక్షించాలని జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్ సూచించారు. బుధవారం మొక్కలు పెంపకం, వాటి ఉపయోగాలపై వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట జిల్లా అటవీశాఖ కార్యాలయం నుంచి విద్యార్థులతో నేచర్ వాక్ చేశారు. ఫారెస్టు అధికారులు విద్యార్థులకు అడవిలోని చెట్లను చూపిస్తూ వాటి వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభా దృష్ట్యా విద్యార్థులు అడవుల సంరక్షణపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. అడవుల ప్రాముఖ్యతను వివరిస్తూ వాటి సంరక్షణపై పలు సూచనలు చేశారు. అడవిలో ఏర్పాటు చేసిన కందకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ధారూరు, వికారాబాద్ అటవీ క్షేత్ర అధికారులు రాజేందర్, శ్యాంకుమార్, సోషల్ వర్కర్ కేవీఎం వెంకట్, అధ్యాపకులు, అటవీసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కృషితో సమన్యాయం


గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

పరిగి: డా.బీఆర్.అంబేడ్కర్ అందరివాడని, ప్రతి గ్రామంలో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేయాలని స్వేరో ఇంటర్నేషనల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్నాపూర్ శ్రీనివాస్ కోరారు. ఈనెల 8న మండల పరిధిలోని ఖుదావన్‌పూర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించి గోడ పత్రికను పట్టణ కేంద్రంలో శ్రీనివాస్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజవంతం చేయాలని కోరారు. రాజ్యాంగ ప్రకారమే దేశంలోని ప్రజలందరికీ సమాన న్యాయం జరుగుతుందంటే అది అంబేడ్కర్ చేసిన కృషే అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

డీపీఓకు విజ్ఞప్తి చేసిన కారోబార్, బిల్‌కలెక్టర్లు


డీపీఓకు వినతిపత్రం అందిస్తున్న కారోబార్లు

కేశంపేట: గ్రామ పంచాయతీల్లో ఇరవై ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను ఉద్యోగులుగా గుర్తించాలని కారోబార్, బిల్ కలెక్టర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్‌కి వినతిపత్రాన్ని కారోబార్, బిల్ కలెక్టర్ల సంఘం జిల్లా సభ్యులు బుధవారం అందించారు. గతంలో గ్రామ పంచాయతీలు తీర్మానాలు చేసి కారోబార్లు, బిల్లు కలెక్టర్లుగా హోదా ఇచ్చాయని గుర్తు చేశారు. గ్రామ పంచాయతీ సాధారణ ఆదాయంలో నుంచి 30% పరిమితితో జీతాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జీపీలు తమకు రూ.15 వేల నుంచి రూ.22 వేల వరకు మాత్రమే జీతాలు ఇస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పంచాయతీ వెబ్‌సైట్‌లో సిబ్బంది వేతన వివరాల నమోదులో బిల్ కలెక్టర్, కారోబార్ అనే ఆప్షన్ లేదని వాపోయారు. తమను మల్టీ పర్పస్ వర్కర్స్(ఎంపీడబ్ల్యూ) లేదా కంప్యూటర్ ఆపరేటర్ అనే ఆప్షన్లు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రత్యేకంగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు జంగయ్య, కేశంపేట మండల అధ్యక్షుడు రవి, సభ్యులు బాలరాజు, యాదయ్య, శివకుమార్, రాజేశ్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల భూములు లాక్కోవద్దు

- లంబాడి భాషను రాజ్యాంగంలో చేర్చాలి
- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న రాంబల్‌నాయక్

షాద్‌నగర్ రూరల్: లంబాడీలు మాట్లాడే 'గోర్ బోలీ'ని భారత రాజ్యాంగంలో చేర్చి అధికారిక భాషగా గుర్తించాలని లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబల్‌నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనధికారికంగా తీసుకువచ్చిన జీఓ 29తో ఎస్టీ, ఎస్సీ, బీసీ విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే జీఓ 29ని రద్దు చేసి గ్రూప్–1 ఉద్యోగాలకు నియామక నోటిఫికేషన్ వేయాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గిరిజన డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పరిశ్రమలు, ఫార్మా, రోడ్ల నిర్మాణం పేరుతో గిరిజనుల భూములను తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. అభివృద్ధి పేరుతో గిరిజనులు భూములను లాక్కోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల నియామకంలో లంబాడీలకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. పోడు భూములకు పట్టాలని ఇవ్వాలని కోరారు. ఈ నెల 22న ఎస్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేసేందుకు ప్రతి తండాకు వెళ్లి గిరిజనులను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దశరథ్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చందర్‌నాయక్, తాలుకా యువజన విభాగం అధ్యక్షుడిగా సంజునాయక్, ప్రధాన కార్యదర్శిగా పరుశరాంనాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజన నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దశరథ్‌నాయక్

కడ్తాల్: లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కడ్తాల్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం షాద్‌నగర్‌లో జరిగిన సంఘం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకంపై లంబాడా నాయకులు సేవ్యానాయక్, హరిచంద్‌నాయక్, శ్రీనునాయక్, శ్రీకాంత్, జగన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.